

కోడ్ రాకముందే..!

- మొదలైన అభ్యర్థుల ప్రచారం - జిల్లాలో ప్రారంభమైన ఎన్నికల హడావుడి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల కోడ్ రాకముందే అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. దీంతో జిల్లాలో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైసిపి ఐదు నియోజకవర్గాల్లో, టిడిపి, జనసేన కూటమి తొమ్మిది నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. కొందరు అభ్యర్థులు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొంటుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వైసిపి ఐదు నియోజకవర్గాల్లో, టిడిపి, జనసేన కూటమి తొమ్మిది నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. వైసిపి నుంచి కర్నూలుకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్‌ను, ఎమ్మిగనూరుకు బుట్టా రేణుకను, కోడుమూరుకు డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను, ఆలూరుకు బుసినే విరూపాక్షిని, నందికొట్కూరుకు డాక్టర్ దారా సుధీర్‌ను ఆ పార్టీ అధిష్టానం నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించింది. ఆ పార్టీ వారినే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులుగా నిర్ణయించింది. మిగిలిన స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఆళ్లగడ్డ టికెట్‌ను భూమా అఖిలప్రియకు, శ్రీశైలం బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, కర్నూలు టిజి.భరత్‌కు, పాణ్యం గౌరు చరితారెడ్డికి, నంద్యాల ఎన్ఎమ్‌డి.ఫరూక్‌కు కేటాయించారు. బనగానపల్లె బీసీ.జనార్ధన్ రెడ్డికి, డోన్ టికెట్‌ను కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డికి, పత్తికొండ టికెట్‌ను కెఇ.శ్యాంబాబుకు, కోడుమూరు టికెట్‌ను బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, పత్తికొండ టికెట్లను ఆయా నియోజకవర్గాల టిడిపి సమన్వయకర్తలకే కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా టిడిపి, వైసిపికి చెందిన పలువురు అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. టిడిపి అభ్యర్థులు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహిస్తూ అందులో భాగంగానే ఎన్నికల ప్రచారం కూడా చేస్తున్నారు. టిడిపి అభ్యర్థుల్లో ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ, బనగానపల్లెలో బిసి.జనార్ధన్ రెడ్డి, కర్నూలులో టిజి.భరత్, పత్తికొండలో కెఇ.శ్యాంబాబు, శ్రీశైలంలో బుడ్డారాజశేఖర్ రెడ్డి, పాణ్యంలో గౌరు చరిత రెడ్డి, నంద్యాలలో ఎన్ఎండి.ఫరూక్ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో సభలను కూడా నిర్వహించారు. వైసిపి అభ్యర్థుల్లో ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించి కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎఎండి.ఇంతియాజ్ అహ్మద్ కర్నూలులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేదలకు పట్టాలు పంపిణీ చేసే ప్రభుత్వ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. కోడుమూరులో డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఆలూరులో బుసినే విరూపాక్షి, నందికొట్కూరులో దారా సుధీర్, ఎమ్మిగనూరులో బుట్టా రేణుక, జోరుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైసిపి అభ్యర్థులుగానే ఏకంగా ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. అభ్యర్థులా ఇన్‌ఛార్జులా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

విజ్ఞానం అందించడమే లక్ష్యం

- ప్రజలకు, విద్యార్థులకు సేవలు
- ప్రజాశక్తితో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల బంగారు భవిష్యత్తు కోసం భావి భారత పౌరులకు విజ్ఞానాన్ని అందించడమే ప్రధాన లక్ష్యంగా గ్రంథాలయ సంస్థ పని చేస్తుందని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్ అన్నారు. "ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలలో 59 గ్రంథాలయాలు పనిచేస్తున్నాయి. ప్రధాన పట్టణాలే కాగా మండల కేంద్రాల్లో సైతం గ్రంథాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు, విద్యార్థులకు కావాల్సిన జ్ఞానాన్ని అందిస్తున్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా గ్రంథాలయాలలో పుస్తకాలను తెప్పించి, విద్యార్థులకు రూ.50, పెద్దలకు రూ.వంద చొప్పున సభ్యత్వం వసూలు చేసి వారికి పుస్తకాలను అందజేస్తున్నాము. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ గ్రంథాలయాలను, ఇంటర్నెట్ సౌకర్యాలు కూడా కల్పిస్తూ, విద్యార్థులకు అందుబాటులో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత హోదాలో ఉండే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుంది." అని పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

ఉమ్మడి జిల్లాల్లో ఎన్ని గ్రంథాలయాలు ఉన్నాయి..? అందులో సొంత భవనాలు ఎన్ని..?

కార్యదర్శి : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 59 గ్రంథాలయాలు ఉన్నాయి. అందులో 29 సొంత భవనాలు, 21 అద్దె భవనాలు, 9 ఉచిత భవనాల్లో గ్రంథాలయాలను నిర్వహిస్తున్నాం. 12 గ్రంథాలయాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

గ్రంథాలయాల్లో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారు..?

కార్యదర్శి : గ్రంథాలయాల్లో 106 మంది శాంక్షన్ స్టాఫ్ అయితే అందులో 46 మంది రెగ్యులర్‌గా పనిచేస్తున్నారు. సహాయకులు 7 మంది, రికార్డ్ అసిస్టెంట్లు 4, అటెండర్లు 6 మంది పనిచేస్తున్నారు. అందులో 16 మంది లైబ్రేరియన్లు, ఔట్సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న వారు 26 మంది ఉన్నారు.

ఎక్కడెక్కడ గ్రంథాలయాల నిర్మాణం పనులు జరుగుతున్నాయి..?

కార్యదర్శి : కోసిగి, కౌతాళం, బేతంచెర్ల, ఓర్వకల్లు, నన్నూరు, చిప్పగిరి, గడివేముల, పాములపాడు, పగిడ్యాల, చాగలమర్రిలలో కొత్త భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఇంటర్నెట్ సౌకర్యాలు ఎక్కడెక్కడ ఉన్నాయి..?

కార్యదర్శి : కర్నూలు, నంద్యాల, బనగానపల్లి, డోన్, కోవెలకుంట్లలలో ఇంటర్నెట్ సౌకర్యాలు ఉన్నాయి. వీటి కోసం ఒక్కొక్క గ్రంథాలయానికి రూ.50 వేల నుండి రూ.20 లక్షల వరకు ఖర్చు చేశాం.



గ్రంథాలయాల్లో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి..?

కార్యదర్శి : జిల్లా గ్రంథాలయాల్లో 6,01,059 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షల కోసం వచ్చే యువత కోసం వారికి కావాల్సిన పుస్తకాలు తెప్పించడం జరుగుతుంది. కాబట్టి కర్నూలు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఎల్లప్పుడూ గ్రంథాలయం నిరుద్యోగులు, విద్యార్థులు పాఠకులతో కళకళలాడుతుంది.

గ్రంథాలయాల్లో సభ్యత్వం కలిగిన వారు ఎంతమంది ఉన్నారు..?

కార్యదర్శి : జిల్లా గ్రంథాలయాల్లో 61,586 మంది సభ్యత్వం తీసుకున్న వారు ఉన్నారు. సభ్యత్వం తీసుకున్న వారు పుస్తకాలను ఇంటికి తీసుకుని వెళ్లి చదువుకొని తిరిగి 15 రోజులకు ఇవ్వాల్సి ఉంటుంది. గ్రంథాలయ చైర్మన్ మద్దూర్ సుభాష్ చంద్రబోస్ సహకారంతో కళాశాలలో, పాఠశాలలో సమావేశాలు నిర్వహించి గ్రంథాలయాలను పరిచయం చేసి సభ్యత్వాలు పెంచడం జరిగింది.

గ్రంథాలయాల పన్ను ఎంత బకాయి ఉంది..?

కార్యదర్శి : గ్రంథాలయాల పన్నులు సుమారు రూ.10 కోట్ల బకాయిలు ఉన్నాయి. అందు 2023-24 సంవత్సరానికి గాను రూ.5,28,16,050 జమ అయ్యాయి. అందులో పరిశ్రమల ద్వారా రూ.12,73,245, పంచాయతీల నుండి రూ.60,86,960, మున్సిపాలిటీల నుండి రూ.45,07,654, కర్నూలు కార్పొరేషన్ నుండి రూ.4,09,48,196 జమ అయ్యాయి. ప్రభుత్వం నుండి గ్రంథాలయాలకు (గ్రాంట్) నిధులు మంజూరు అయితే వాటి ద్వారా గ్రంథాలయాలకు కావలసిన నూతన భవనాలు నిర్మాణాలు చేస్తాం. పుస్తకాలను టెండర్ల ద్వారా పిలిచి కొనుగోలు చేయడం జరుగుతుంది.



సరదా కోసం వెళ్లి.. మృత్యుఒడిలోకి

- ఈతకెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి
- చిరుతపల్లిలో విషాదం

ప్రజాశక్తి - కౌతాళం

విద్యార్థుల సరదా ప్రాణాలు తీసింది. రోజూ కలిసిమెలిసి పాఠశాలకు వెళ్లే స్నేహితులు ఆదివారం కూడా ఆటలాడుతూ గ్రామ సమీపంలోని చెరువులో సరదాగా ఈత కోసం వెళ్లి మృతి చెందారు. మండలంలోని చిరుతపల్లి గ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అమీర్, దేవేంద్ర, యువరాజు కలిసి గ్రామ సమీపంలోని మామిడి చెట్ల వద్ద ఆడుకున్నారు. మిట్ట మధ్యాహ్నం కావడంతో సమీపంలో ఉన్న చెరువు దగ్గరకు ఈత కోసమని వెళ్లారు. చెరువులో ఈతకు వెళ్లిన అమీర్ (11), దేవేంద్ర (11) నీటిలో మునిగిపోయారు. ఈ సంఘటనను చూసి యువరాజు గ్రామం వైపు పరుగులు తీసి విషయాన్ని గ్రామస్తులకు చేరవేశాడు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి రక్షించేలోపు ఇద్దరూ మృతి చెందారు. ఈ విషయం గ్రామస్తులందరికీ తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి చిరుతపల్లి గ్రామంలో పోలీసులతో విచారణ చేపట్టారు. చిరుతపల్లి గ్రామానికి చెందిన బాష, జలాల్‌బీ దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 5వ తరగతి చదువుతున్న అమీర్ ఈతకెళ్లి మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన హరిజన కర్రెప్ప, మార్తమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు దేవేంద్ర మృతి చెందాడు.


మృతి చెందిన చిన్నారులు

పోలియో చుక్కలు తప్పనిసరి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జిఒ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తమ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు నగరం ఏ క్యాంప్ లోని ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు జిల్లా కలెక్టర్ పల్స్‌పోలియో చుక్కల వేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసి చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దామని కలెక్టర్ పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని అది మనందరి బాధ్యత అని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలో 3,48,071 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలకు 1600 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని , అదే విధంగా ప్రయాణంలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయుట కొరకు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలలో 52 కేంద్రాలు ఏర్పాటు చేసామని తెలిపారు. ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాలు, సంచార జాతుల గుడారాలు వంటి హై రిస్క్ ప్రాంతాలలో ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలకు పోలిచుక్కలు వేయుటకు 63 మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఏదేనీ కారణం చేత పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు ఈనెల 4, 5, 6న ఇంటింటికీ వైద్య బృందాలు తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ రవీంద్రా రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ రామగిడ్డయ్య, డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిఐఒ శామ్యూల్ పాల్గొన్నారు.


చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

అప్పల బాధ తాళలేక
రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కర్నూలుక్రైం

కర్నూలు మండలంలోని గార్గేయపురం గ్రామానికి చెందిన గొల్ల కష్టుడు (61) వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా తనకున్న ఒక ఎకరా సొంత పొలంతోతో పాటు, పది ఎకరాల పొలాన్ని కౌలుకు చేసుకొని మిరప, పత్తి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గడచిన రెండేళ్ల ఈ సంవత్సరం కూడా పంటలు ఆశించినంత దిగుబడి లేక నష్టాలు రావడం వలన, అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక, మనస్థాపం చెంది శనివారం రోజున మధ్యాహ్నం రెండు గంటల పరిసర ప్రాంతాల్లో గ్రామ సమీపంలో ఉన్న పూడిచెర్ల వాగు, సుంకన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కార్మిక పక్షపాతిని ఎమ్మెల్యేగా ఎన్నుకోండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రానున్న ఎన్నికల్లో కార్మికుల గురించి ప్రజల గురించి ఆలోచించే నాయకున్ని ఎన్నుకోవాలని సిపిఎం న్యూ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.సాయి బాబా కార్మికులను కోరారు. ఆదివారం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ఆటో కార్మిక సంఘం ఆక్సిలరీ కమిటీ సమావేశం ఆ శాఖ కార్యదర్శి షంషేర్ అధ్యక్షతన జరిగింది. సిహెచ్. సాయిబాబా, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడుతూ... గత పాలకులు కార్మికుల గురించి ప్రజల గురించి ఏమాత్రం సంబంధం లేని విధంగా మెలిగారని, ఆటో కార్మికులు సెన్సార్ కెమెరాల ద్వారా వివిధ ఫైనల్ లో ద్వారా భారీగా పెరిగిన ఈ చలానాల ద్వారా, కొత్తగా తెచ్చిన భారత న్యాయ సంహిత చట్టం ద్వారా ఇబ్బందులు పడుతున్న ఏ ప్రజా ప్రతినిధి ఎవరూ పట్టించుకోవడంలేదని అన్నారు. కార్మికులు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో విసిగి వేసారుతున్నారన్నారు. పెరిగిన ధరలను తగ్గించాలని సెన్సార్ ద్వారా పడిన వేలాది రూపాయల ఫైన్లను తొలగించాలని అనేక ఆందోళన కార్యక్రమాలు చేసినా ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని వారన్నారు. రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు కార్మికులను కోరారు. సభ్యులు.డి షేక్షావలి, ఎద్దుల రాజు, వెంకటేష్ ,తనుష్ కుమార్, కాశీ భాష, , ధనుంజయ్, కుమార్,మహమ్మద్ రఫీ,నరేష్, సుబ్రమణ్యం ,మా భాష. పాల్గొన్నారు.


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న లయన్ రాయపాటి శ్రీనివాస్

పిల్లలను అంగవైకల్యం నుంచి దూరం చేయాలి

-లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలను వేయించి వారిని అంగవైకల్యం బారిన పడకుండా జాగ్రత్తపడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనిని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ కౌన్సిల్ చైర్మన్ అల్లాయ్ అండ్ లయన్ డాక్టర్ అంబాసిడర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు.లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ ఇంటర్నేషనల్ గ్రేటర్ కర్నూల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చింతలముని నగర్ లోని పోలియో కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులను ప్రోత్సహించడానికి బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ పోలియో రహిత భారతదేశం ఏర్పాటు కోసం స్వచ్ఛంద సంస్థలు తన వంతు సహకారం అందించాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షురాలు లయన్ రాయపాటి నాగలక్ష్మి, కార్యదర్శి లయన్ సిడి గోవర్ధనగిరి , లయన్స్ క్లబ్ సభ్యులు, ఆశా వర్కర్ డి.శారద ,అంగన్వాడీ టీచర్ బి. వెంకటేశ్వరమ్మ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, లక్ష్మీ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల పోరాటస్ఫూర్తి అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆకట్టుకున్న కళారూపాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శ్రామిక మహిళలకృషి, పోరాట స్ఫూర్తితో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు అన్నారు. నవ్యాంధ్రుల రచయిత్రుల సంగం (నరసం) ఆధ్వర్యంలో కందనవోలు కవత్రులందరూ ముందస్తుగా మద్దూరునగర్ పింగళి సూరన తెలుగు తోటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కావెం సుబ్బలక్ష్మమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. దుర్గాబాయి, సావిత్రిబాయి పూలేచిత్రపటాలకు కర్నూలు కవయిత్రి చక్కిలం విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్.అలివేలు మాట్లాడుతూ ఎంతో అభివృద్ధి చెందామని అనుకుంటునప్పటికీ మహిళల చుట్టూ చాలా అభద్రత, అన్యాయం ఎదురవుతూనే ఉన్నాయన్నాయని అన్నారు. బాలిక అంటేనే వద్దు అనుకునే సమాజం ఇంకా ఉందని, దీనిపై అవగాహన తీసుకురావడానికి మనం ఎంతో కృషి చేయాల్సింది ఉందని ఆమె సూచించారు. మహిళలు చైతన్యవంతులు కావాలని డిఎస్‌పి మహబూబ్‌బాష అన్నారు. తమను తాము ఉత్సాహపరచుకుంటూ అన్ని విషయాల్లో ముందుకు సాగాలని ఆయన సూచించారు.నరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతి దేవి మాట్లాడుతూ కవయిత్రులు కేవలం రచనలతో సరిపెట్టుకోకుండా సమాజ శ్రేయస్సు కోసం సేవ చేయాలని చేతనైనంత ప్రతి ఒక్కరు సమాజ అభ్యున్నతిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. నరసం మహిళలంతా ఈ సందర్భంగా మనకోసం మనం సమాజ శ్రేయస్సు కోసం మనం అని నినాదంతో తప్పక ప్రతి ఒక్కరం సమాజసేవ చేస్తామని ప్రతిజ్ఞ చేయడం విశేషమన్నారు. మహిళలంతా కలిసి కండే సునీత సమన్వయంలో కందనవోలు నవనారి కవన విజయం అనే రూపక ప్రదర్శన అందరిని ఆకర్షించింది. నాటి రచయిత్రులను, కవయిత్రులను గుర్తు చేసుకుంటూ ఈ రూపకం సాగింది. రామభద్రం, తాళ్లపాక తిమ్మక్క, మొల్ల, తిరుమలాంబ, పసుపులేటి రంగాజమ్మ, మోహనాంగి, ముద్దుఫలని, తరిగొండ వెంగమాంబ పాత్రలతో చక్కటి పద్యాలతో పాత్రధారులు సభను అలరింప చేశారు. చంద్రమౌళిని పార్వతీదేవి పసుపులేటి నీలిమ లీలావతి మాసుంబి సుబ్బలక్ష్మి అమ్మ సునీత కళ్యాణి ఈ రూపకంలో పాత్రధారులుగా వ్యవహరించారు. ఆ తర్వాత హసీనాబీ రాణి రుద్రమదేవి పాత్రలో బాలికలకు ఎదిగే సహకారం ఇవ్వండి మహిళను గొప్పగా ప్రోత్సహించండి. అంటూ చక్కటి అభినవ రుద్రమదేవిగా నటించారు. ఆ తర్వాత నృత్యం, కవిత్వం, ఏకపాత్రాభినయం కోలాటం అంత్యాక్షరి క్యాట్‌వాక్ వంటి ఆటపాటలతో కార్యక్రమాలు సాగాయి. సభలో కందనవోలు మహిళా మణులతో పాటు ఆవోపా మహిళలు పాల్గొన్నారు. విజయ దుర్గ, జ్యోతిర్మయి, విజయమ్మ, రజనీకల్, కూర స్వర్ణ లత, పద్మలత , జేఎస్ఆర్‌కె.శర్మ , ఎలమర్తి రమణయ్య, లక్ష్మయ్య, మణికంఠ దండబోయిన రమేష్ తదితరులు హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు


మహిళా క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ

లింగ వివక్ష లేని సమాజం అవసరం

తైక్వాండో మహిళ క్రీడాకారులను సన్మానించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సమాజంలో అవకాశాలు కల్పిస్తే మహిళలు పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా రాణిస్తారని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణమండపంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ తైక్వాండో క్రీడాకారులను ఆయన ఘనంగా సన్మానించారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ఏ రంగంలో అయినా మహిళలు పురుషులకు తీసిపోని విధంగా రాణించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సమాజంలో స్త్రీ, పురుషులు అనే వివక్ష లేకుండా ప్రతి ఒక్కరూ అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. అభివృద్ధి చెందిన అమెరికా, చైనా లాంటి దేశాల్లో దేశ అధ్యక్ష పదవి ఇంతవరకు మహిళలకు దక్కలేదని, ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం లాంటి దేశాల్లో మహిళలకు అలాంటి అవకాశాలు దక్కిన విషయాన్ని గుర్తు చేశారు. మన దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమైన పరిపాలన అందించిన విషయాన్ని గుర్తు చేశారు. సమాజంలో ఇంకా స్త్రీల పట్ల వివక్ష ధోరణి ఉండడం దురదృష్టకరమని అన్నారు. పురుషులతో సమానంగా రాణించే అవకాశం ఉన్నప్పటికీ మహిళలకు ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లభించడం లేదన్నారు. మహిళలు ప్రధానమంత్రి, రాష్ట్రపతి లాంటి అత్యున్నత పదవిలో రాణించడంతోపాటు క్రీడారంగంలోనూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్న విషయాన్ని వివరించారు. ఎక్కడైతే మహిళా గౌరవిస్తారో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. తైక్వాండో శిక్షకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం : ఇంతియాజ్


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఇంతియాజ్

జాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూల్ నగరంలోని 49వ వార్డులో వైసిపి కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త, సీనియర్ ఐఎఎస్ అధికారి ఎఎండి ఇంతియాజ్ ఆదివారం స్థానిక కార్పొరేటర్ కృష్ణకాంతుతో కలిసి ప్రారంభించారు. పోలియో మహమ్మారి పిల్లల పాలిట శాపంగా మారిందని దాన్ని తరిమివేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పోలియో నివారణ కార్యక్రమాన్ని యుద్ధంగా భావించి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఐదు సంవత్సరాల లోపు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం : ఎంపిపి: పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపిపి వెంకటేశ్వరమ్మ ఉల్చాల గ్రామంలో పిల్లలకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.

కండేరిలో : కర్నూలు నగరం ఒకటవ వార్డు ఖండేరిలో పల్స్ పోలియో చుక్కలను పసిపిల్లలకు అవార్డు కార్పొరేటర్ పి.షాషావలి వేశారు.


ఈ తాండ్రపాడులో పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచి


కండేరిలో పోలియో చుక్కలు వేస్తున్న షాషావలి

ఈ తాండ్రపాడులో : కర్నూలు మండలం ఇ తండ్రపాడు గ్రామంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను ఇ.తాండ్రపాడు గ్రామ సర్పంచి బాలపీర వైద్య సిబ్బందితో కలిసి వేశారు. పోలియో రహిత సమాజాన్ని తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.

జైల్ పోస్టులకు మెరిట్ జాబితా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : అర్హులైన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లో జూనియర్ లెక్చరర్ పోస్టుకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యొక్క జాబితాను సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏమైనా ఈ జాబితాపై అభ్యంతరాలను సోమవారం ఉదయం 11 లోపు తెలియజేయాలని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్లో స్పందన

కర్నూలు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సమావేశ భవనంలో సోమవారం స్పందన ప్రజా వినితుల స్వీకరణ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సృజన ఓ ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. బాధితులు నేరుగా జిల్లా కేంద్రానికి వచ్చి తమ వినతులను విన్నవించుకోవాలని కోరారు.



వార్డులో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 33వ వార్డులో శంఖారావం కార్యక్రమంలో భాగంగా రెండో రోజూ పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి అధికార వైసిపి హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో టిడిపి, జనసేనల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజలకు లబ్ధి చేకూర్చే సూపర్ సిక్స్ పథకా గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. వార్డు ఇన్‌ఛార్జీ రామకృష్ణ నాయుడు, టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, మధుబాబు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- 4న విజయవాడలో ధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు, ఎపిఎస్‌ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు కృష్ణ, సైపుల్లా, రంగస్వామి, చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్‌టిసి ప్రాంగణంలో డిమాండ్ల సాధన కోసం 4న చేపట్టే చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎపిఎస్‌ఆర్‌టిసిలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. బస్సు సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడలో ప్రతి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్‌సిఆర్‌ఎంయు ఆధ్వర్యంలో సెంచూరి కప్

ప్రజాశక్తి - ఆదోని

సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా యూనియన్ సంఘ్ ఆధ్వర్యంలో సెంచూరి క్రికెట్ పోటీలు నిర్వహించామని యూనియన్ డివిజన్ సెక్రటరీ, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు ఆదివారం నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో నిమగ్నమైన ఉద్యోగులకు క్రికెట్ పోటీలతో కొంత వరకు మానసిక ఒత్తిడి తగ్గి ఉపశమనం లభిస్తుందన్నారు. విజేతకు రూ.2,016, రన్నర్‌కు రూ.1,016 అందించామని వివరించారు. యూనియన్ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో యూనియన్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రతి ఉద్యోగీ పాల్గొనేలా చేయాలన్నారు. యూనియన్ సభ్యులు షేకన్న పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే స్టేషన్ మేనేజర్

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, కమిషనర్ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, కమిషనర్ రామచంద్రా రెడ్డి తెలిపారు. ఆదివారం ఆదోనిలోని వెంకన్న పేట హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగవైకల్యం లేని అందమైన బాల్యం చిన్నారుల హక్కు అని తెలిపారు. దీని కోసం తల్లిదండ్రులు బాధ్యతగా ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆదోనిలోని 61 కేంద్రాల్లో 18,675 మంది చిన్నారులకు 1,082 వైల్స్ డ్రాప్ వేసినట్లు తెలిపారు. పట్టణంలో 97.5 శాతం చిన్నారులు పోలియో చుక్కలు వేయించుకున్నారని చెప్పారు. మరో రెండు రోజులు ఇంటింటికీ వెళ్లి హెల్త్ సిబ్బంది చిన్నారులకు చుక్కలు వేస్తారన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరనాథ్ ఉన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని శిల్పా ఎస్టేట్ వైఎస్‌ఆర్ హెల్త్ సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక కోరారు. నాయకులు బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతూల్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, పట్టణ నాయకులు కదిరికోట సునీల్ కుమార్, వార్డు ఇన్‌ఛార్జీ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని 13 పంచాయతీల్లో 95 శాతం పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి డాక్టర్ అఫ్రోజ్ జహాన్, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని అనేక కేంద్రాల్లో ప్రభుత్వ డాక్టర్లు పరిశీలించారు. మండలంలో మొత్తం 4,616 మంది పిల్లలకు గాను 4,385 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. నేమకల్లు సచివాలయంలో ఎంపిటిసి సుంకన్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 8 గంటలకే పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు క్యూ కట్టారు. రెండు రోజులు ఇళ్ల దగ్గరికి వచ్చి వేయించుకోని పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఎఎన్‌ఎం సువర్ణమ్మ, అంగన్వాడీ టీచర్లు బాల రంగమ్మ, వన్నూరమ్మ, పార్వతి, ఆశ కార్యకర్త రాధా, కవిత పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో సచివాలయాల్లో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మల్లికార్జున మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి అవగాహన పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఎఎన్‌ఎం, అంగన్వాడీ కార్యకర్త జ్యోతి, అనసూయమ్మ పాల్గొన్నారు.



ఆదోనిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్



ఎమ్మిగనూరులో పోలియో చుక్కలు వేస్తున్న బుట్టా రేణుక



చిప్పగిరిలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య, అంగన్వాడీ సిబ్బంది

కరివేములలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - దేవనకొండ

హజరత్ వన్నూరు స్వామి ఉరుసు సందర్భంగా కరివేముల గ్రామ సచివాలయంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డేనియల్ రాజ్ ఫౌండేషన్ సౌజన్యంతో గ్రామ పెద్ద జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద జనార్ధన్ రెడ్డి మాట్లాడారు. మదర్ థెరిస్సా, పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో రెండో ఏడాది నిర్వహించిన రక్తదాన శిబిరంలో 55 మంది రక్త దాతలు రక్తదానం చేశారని తెలిపారు. ఇందుకు సహకరించిన గ్రామ యువత వీరేష్, కృష్ణ, రవి, ప్రతాప్, కౌలుట్ల, రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

- వధూవరులను ఆశీర్వదించిన వైసిపి, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి యువ నేత వై.ప్రదీప్ రెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం స్థానిక హెచ్‌ఆర్‌బి కల్యాణ మండపంలో విద్యుత్ శాఖ ఎఇ గోవిందు, జ్యోతి దంపతుల ఏకైక కుమారుడు హేమంత్ కుమార్, శిరీష వివాహ వేడుకలకు హాజరయిన వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఎస్ఐ గోపినాథ్, వైసిపి నాయకులు పెట్రోల్ బంకు శీను, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, బొంబాయి శివ, బంగారు బాబు, అల్లింగప్ప, సెంట్రింగ్ రాము, లైన్‌మేన్ రంగస్వామి ఉన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

కక్షలు, కార్పణ్యాలు మా నైజం కాదు

- జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

రాజకీయ స్వలాభం కోసం కక్షలు, కార్పణ్యాలు పెంచుకుని అమాయకులైన కార్యకర్తలను బలి చేయడం తమ నైజం కాదని జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ మల్లప్ప తెలిపారు. ఆదివారం రాత్రి ఎస్‌కెడి కాలనీలోని సంస్కృతి ఫంక్షన్ హాలులో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రేణువర్మ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అంతకుముందు జనసేన పార్టీ కార్యకర్త రూపొందించిన 'ఆదోని వాసి మేలుకో' అన్న గేయాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. జనసేన పేరు విన్నా, జనసేన పార్టీలో పిల్లలే ఉన్నారని వైసిపి నేతలు అనుకుంటున్నా, ఆ పిల్లలు చేస్తున్న పోరాటం, ప్రజలకు అండగా ఉన్న విషయాలను తెలిసి వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి ఐక్యతతో వైసిపి ఓటమి ఖాయమన్నారు. జనసేన పార్టీలో ఉండేదంతా పిల్లలే అని అందరూ అనుకుంటున్నారని తెలిపారు. వైసిపి నాయకులు, వైసిపి ప్రజాప్రతినిధులు ప్రజలను మభ్యపెడుతూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ పిల్లలే గత నాలుగున్నర ఏళ్లుగా ప్రజల పక్షాన ఉండి పోరాటం చేశారని తెలిపారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీకి అండగా ఉన్న ఆ పిల్లలే.. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రెండుసార్లు ఆదోని పర్యటనకు వస్తే లక్షలాదిమంది ప్రజలను కదిలించారని చెప్పారు. అలాగే పోలింగ్‌లో 12 వేల మంది ఓటర్ల హృదయాలను కదిరించి జనసేనకు ఓట్లు వేయించారని వివరించారు. ఆదోనిలో జనసైనికులు పార్టీ కోసం, ప్రజల కోసం పని చేస్తున్నారని, వారి సేవలను ఎప్పటికీ మరవనని తెలిపారు. జనసేన పార్టీ టిడిపితో నడవడం లేదని, టిడిపితో కలిసి నడుస్తున్నామని, అనవసరంగా విమర్శలు చేయడం మానుకోవాలని వైసిపి నేతలకు హితవు పలికారు. 2014లో టిడిపి విజయం జనసేనతోనే సాధ్యమైందని, నాడు పార్టీ విజయానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేశారని తెలిపారు. అంతే వేగంగా ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై కూడా టిడిపి ప్రభుత్వాన్ని, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రశ్నించారని గుర్తు చేశారు. అమరావతి రైతులకు జరుగుతున్న అన్యాయం, ఉద్దండు కిడ్నీ బాధితులకు జరిగిన అన్యాయంపై నిలదీశారన్నారు. రాజకీయాల కక్షలకు ఎవరూ పాల్పడవద్దని, ఎవరినీ రెచ్చగొట్టే విధంగా మాట్లాడవద్దని సూచించారు. అంతకంటే ముఖ్యంగా సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్‌తో విమర్శలు చేయవద్దని, నేరుగానే విమర్శలకు జనసైనికులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. నాయకులు రాజేశ్వరి మాట్లాడుతూ... తనకు వైసిపి నాయకులు రూ.5 లక్షలు, ఇంటి స్థలం ఇస్తానన్నా తాను జనసేన పార్టీని, ఇన్‌ఛార్జీ మల్లప్పను వదిలి వెళ్లలేదని తెలిపారు. తన ప్రాణం ఉన్నంతవరకు జనసేనలో మల్లప్పకు అండగా ఉంటానని చెప్పారు. రాజశేఖర్, రేణు వర్మ, పులిరాజు, శ్రీనివాసులు, ప్రకాష్, మారుతి, జయరామ్, చిరుత రాజశేఖర్, వందలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లప్ప



ఆత్మీయ సమ్మేళనానికి హాజరయిన జనసైనికులు

మహారాజశ్రీ కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A No. 220/2023 in O.S No.98/2014

ఎస్.రసూల్ బీ వగైరా. ...పిటిషనర్స్/వాదులు

వర్సెస్

రమిజాబీ వగైరా. ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

3వ రెస్పాండెంట్ కు నోటీసు

నసిమా బీ భర్త మహబూబ్ బాషా
R/o మునగాల గ్రామము,
గూడూరు మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబర్ గల అర్జీలో వాదులు 28-09 -2022వ తేదీన కోర్టు వారు చేసిన ప్రిలిమినరి డిక్రిని ఫైనల్ డిక్రి చేయమని షెడ్యూల్డు ఆస్తి బాగాలు కోరి అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 3వ రెస్పాండెంట్ అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 21-03-2024వ తేదీన పగలు ఉదయం 10:30 గంటలకు పైకోర్టులో మీరు కానీ వకీలు ద్వారా కాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

SCHEDULE

Item No.1. The agriculture land in Sy.No.183 to an extent of Ac.3.00 cents situated in Munagala Village, Gudur Sub-Registration and Kurnool Registration District., with the following boundaries.
East : Land of Hanumanna
West : Land of Venkatappa
North : Land of Venkatappa
South : Land of Guni Hussain
Market value Rs.2,40,000/-

Item No.2. The agriculture land in Sy.No.106 to an extent of Ac.1.12 cents situated in Munagala Village Gudur Sub-Registration and Kurnool Registration District., with the following boundaries.
East : Land of Talari Kamal
West : Land of Khaja Hussain
North : Land of Boya Moddu Ramanna
South : Land of Boya Moddu Ramanna
Market value Rs.89,600/-

Item No.3. The agriculture land in Sy. No.243 to an extent of Ac.0.90cents situated in Munagala Village Gudur Sub-Registration and Kurnool Registration District., with the following boundaries.
East : Land of Ismail
West : Land of teacher Ahmed
North : Land of Minnella
South : Land of Khaja Hussain
Market value Rs.72,000/-

Item No.4. The agriculture land in Sy.No.283 to an extent of Ac.0.96 cents situated in Munagala Village Gudur Sub-Registration and Kurnool Registration District., with the following boundaries.
East : S.C Colony
West : Ponnakallu Rasia
North : Land of teacher Ahmed
South : Land of Boya Roganna
Market value Rs.76,800/-

Item No.5. The agriculture land in Sy.No.283 to an extent of Ac.0.96 cents situated in Munagala Village Gudur Sub-Registration and Kurnool Registration District., with the following boundaries.
East : S.C Colony
West : Ponnakallu Rasta
North : Land of teacher Ahmed
South : Land of Boya Roganna
Market value Rs.76,800/-

Item No.6 Open plot in Sy.No.267/1A to an extent of 193.6. Sq.yards situated in Munagala Village Gudur Sub-Registration and Kurnool Registration District., with the following boundaries.
East : Rasta
West : Sankaraiah Kallam
North : Boya sankaraiah Kallam
South : Rasta
Market value Rs.58,080/-

Item No.7. Kallam in Sy No. 141/1A, 141/1C to an extent of Ac.0.33 cents situated in Munagala Village Gudur Sub-Registration and Kurnool Registration District, with the following boundaries.
East : TB Canal
West : TB Canal
North : Ulchala Venkateswar Reddy
South : TB Canal
Market value Rs.26,400/-

Item No.8 House built with mud in Sy. No.265 to an extent of 53.3Sq.yards situated in Munagala Village Gudur Sub-Registration and Kurnool Registration District, with the following boundaries.
East : Rasta
West : House of Anjanaiah
North : House of Guni Hussain Saheb
South : Smasanam
Market value Rs. 75,990/-

కోర్టువారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేది : 21-03-2024

జి. మధుసూధన రెడ్డి,
వాదిపరం న్యాయవాది, కర్నూలు.
సెల్ : 9440291373



'మోడల్' ప్రవేశాలకు దరఖాస్తులు ప్రారంభం

- ప్రిన్సిపల్ షాహినా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆంధ్రప్రదేశ్‌లోని ఎపి మోడల్ (ఆదర్శ) పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల కోసం రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. గోనెగండ్లలోని ఎపి మోడల్ పాఠశాలలో 6వ తరగతి (2024-25 విద్యా సంవత్సరం)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 3 నుంచి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నేరుగా మోడల్ పాఠశాలకు వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. దరఖాస్తులకు ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తులను పాఠశాలల్లో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనలను అనుసరించి సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

జైల్ పోస్టులకు మెరిట్ జాబితా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అర్హులైన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లో జూనియర్ లెక్చరర్ పోస్టుకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జాబితాను సిద్ధం చేసినట్లు డిఇఒ కె.శామ్యూల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలను సోమవారం ఉదయం 11లోపు తెలియజేయాలని పేర్కొన్నారు.

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి...

- వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని వైసిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి తెలిపారు. 'నేను సిద్ధం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలూరులో ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మాజీ ఎంపిటిసి పెట్రోల్ బంకు కిషోర్ ఆధ్వర్యంలో బి.విరుపాక్షి ముందస్తు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణదారుల సమస్యలు వింటూ కోయనగర్ కాలనీలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానిక ప్రజల కోరిక మేరకు అతి త్వరలోనే తాత్కాలిక బిటి రోడ్డు వేయిస్తానని తెలిపారు. డ్రెయినేజీ, తాగునీటి సమస్యను అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కరిస్తానని చెప్పారు. అంతకుముందు హాలహర్వి మండలం బొల్లూరు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, దేవనకొండ మండలం తెర్నేకల్, కరివేముల, గుమ్మరాల గ్రామాల నుంచి 100 మంది విరుపాక్షి ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మండల కన్వీనర్ చిన్న ఈరన్న, కో కన్వీనర్ వీరేష్, మాజీ ఎంపిటిసి పెట్రోల్ బంక్ కిషోర్, మొలగవల్లి రామాంజినేయులు, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, ఆలూరు సొసైటీ డైరెక్టర్ వెంకటేష్, సీనియర్ నాయకులు గంగాధర్ రెడ్డి, మాజీ సర్పంచి సోమప్ప పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న విరుపాక్షి

నాగులూటి అన్నదాన గ్రూపు సభ్యులకు

టీ షర్ట్‌లు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఉన్న నాగలూటి వీరభద్రస్వామి ఆలయ ప్రాంతంలో ప్రతేడాది మహాశివరాత్రి సందర్భంగా పాదయాత్ర చేసే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసే గ్రూపు సభ్యులకు మేఘన స్పోర్ట్స్ వీరారెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీ వై.సీతారామయ్య, మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు చేతుల మీదుగా 50 టీ షర్ట్‌లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీ షర్ట్‌లు స్పాన్సర్ చేసిన వీరారెడ్డిని డీఎస్పీ సీతారామయ్య అభినందించారు. అలాగే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేసుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు. మల్లెల గ్రూప్ సభ్యులు సాల్మన్ రాజ్, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్ పాల్గొన్నారు.



టీ షర్ట్‌లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ సీతారామయ్య, మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు



దళిత నాయకులతో మీనాక్షి నాయుడు

దళిత గర్జనకు టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలులోని ఎంఆర్‌సి కన్వెన్షన్ హాలులో జరిగే టిడిపి దళిత గర్జన సదస్సుకు ఆదివారం ఆదోని నుంచి టిడిపి నాయకులు తరలివెళ్లారు. టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షినాయుడు స్వగృహం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు దగ్గరుండి బస్సుల్లో, కార్లలో నాయకులను ఆదోని నుంచి సాగనంపారు. ఈ దళిత గర్జన రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి ఓ మలుపు కావాలని ఆకాంక్షించారు.

రంగముని రంగస్థలం సేవలు స్మరణీయం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

పద్యనాటక రంగానికి గురువుగా ఉంటూ విశేష సేవలు అందించిన రంగముని సంగీత సేవలను పలువురు వక్తలు అభినందించారు. ఆదివారం రాత్రి స్థానిక టిజివి కళాక్షేత్రంలో రంగముని ఏడవ వర్ధంతి సభ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమానికి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహిస్తూ రంగముని హార్మోనిస్టుగా ఎందరో శిష్యులను తయారు చేశారన్నారు. ఈ సందర్భంగా సంగీత గురువులు బాలు, అనితలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు ఎంపి బసవరాజు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్.శేషయ్య, బిసి సంఘం జాతీయ అధ్యక్షులు నక్కల మిట్ట శ్రీనివాసులు, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ కైక, అధికారులు మురళీకృష్ణ, బంగి శ్రీధర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి వెంకట రమణ, మధు, స్వాగతం పలికారు. అంతకుముందు స్వర దాసరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు జరిగాయి.



నివాళులర్పిస్తున్న నాయకులు

బాబు ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేగా పోటీ

- ఎల్లార్తి మల్లికార్జున

ప్రజాశక్తి - ఆస్పరి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆశీర్వదిస్తే ఆలూరు నియోజకవర్గం నుంచి టిడిపి తరపున పోటీ చేస్తానని టిడిపి సీనియర్ నాయకులు ఎల్లార్తి మల్లికార్జున తెలిపారు. ఆదివారం ఆయన ఆస్పరి మండలంలో పర్యటించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ఇటువంటి ముఖ్యమంత్రి అవసరం లేదని రాష్ట్ర ప్రజలు అంటున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆలూరును అభివృద్ధి చేసి, కరువుకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని తెలిపారు. టిడిపి ఆలూరు నియోజకవర్గ నాయకులు తిమ్మప్ప, రవి కుమార్, కాంత కృష్ణ, శేఖర్, గాదిలింగ, టిడిపి ఆస్పరి మండల నాయకులు వెంకటేష్, ప్రకాష్, మల్లికార్జున, మోహన్, తిమ్మప్ప, గిరప్ప, నాగేంద్ర, షేకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లార్తి మల్లికార్జున





చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కె.శ్రీనివాసులు

కోడ్ రాకముందే..

- మొదలైన అభ్యర్థుల ప్రచారం
- జిల్లాలో ప్రారంభమైన ఎన్నికల హడావుడి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల కోడ్ రాకముందే అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. దీంతో జిల్లాలో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైసిపి ఐదు నియోజకవర్గాల్లో, టిడిపి, జనసేన కూటమి తొమ్మిది నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. కొందరు అభ్యర్థులు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొంటుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వైసిపి ఐదు నియోజకవర్గాల్లో, టిడిపి, జనసేన కూటమి తొమ్మిది నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. వైసిపి నుంచి కర్నూలుకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్‌ను, ఎమ్మిగనూరుకు బుట్టా రేణుకను, కోడుమూరుకు డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను, ఆలూరుకు బుసినే విరూపాక్షిని, నందికొట్కూరుకు డాక్టర్ దారా సుధీర్‌ను ఆ పార్టీ అధిష్టానం నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించింది. ఆ పార్టీ వారినే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులుగా నిర్ణయించింది. మిగిలిన స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఆళ్లగడ్డ టికెట్‌ను భూమా అఖిలప్రియకు, శ్రీశైలం బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, కర్నూలు టిజి.భరత్‌కు, పాణ్యం గౌరు చరితారెడ్డికి, నంద్యాల ఎన్ఎండి.ఫరూక్‌కు కేటాయించారు. బనగానపల్లె బీసీ.జనార్ధన్ రెడ్డికి, డోన్ టికెట్‌ను కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డికి, పత్తికొండ టికెట్‌ను కెఇ.శ్యాంబాబుకు, కోడుమూరు టికెట్‌ను బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, పత్తికొండ టికెట్లను ఆయా నియోజకవర్గాల టిడిపి సమన్వయకర్తలకే కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా టిడిపి, వైసిపికి చెందిన పలువురు అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. టిడిపి అభ్యర్థులు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహిస్తూ అందులో భాగంగానే ఎన్నికల ప్రచారం కూడా చేస్తున్నారు. టిడిపి అభ్యర్థుల్లో ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ, బనగానపల్లెలో బిసి.జనార్ధన్ రెడ్డి, కర్నూలులో టిజి.భరత్, పత్తికొండలో కెఇ.శ్యాంబాబు, శ్రీశైలంలో బుడ్డారాజశేఖర్ రెడ్డి, పాణ్యంలో గౌరు చరిత రెడ్డి, నంద్యాలలో ఎన్ఎండి.ఫరూక్ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో సభలను కూడా నిర్వహించారు. వైసిపి అభ్యర్థుల్లో ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించి కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎఎండి.ఇంతియాజ్ అహ్మద్ కర్నూలులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేదలకు పట్టాలు పంపిణీ చేసే ప్రభుత్వ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. కోడుమూరులో డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఆలూరులో బుసినే విరూపాక్షి, నందికొట్కూరులో దారా సుధీర్, ఎమ్మిగనూరులో బుట్టా రేణుక, జోరుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైసిపి అభ్యర్థులుగానే ఏకంగా ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. అభ్యర్థులా ఇన్‌ఛార్జులా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

చిన్నారుల భవిష్యత్తుకు రెండు చుక్కలు

- పోలియో రహిత సమాజం కోసం కృషి
- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్‌పి రఘువీర్ రెడ్డి
- పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డిలు పేర్కొన్నారు. రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో రక్కసిని తరిమికొట్టాలన్నారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల పట్టణం బొమ్మల సత్రం సమీపంలోని నలంద స్కూల్లో చిన్నారులకు జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రక్కసి నుండి వారిని కాపాడాలని తల్లిదండ్రులకు సూచించారు. మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి 4, 5వ తారీఖుల్లో ప్రతి ఇంటికెళ్లి పోలియో చుక్కలు వేసేలా వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలు 2,34,382 మంది ఉండగా 2,27,782 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. 97.23 శాతం పూర్తయినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులు, అర్బన్ సెంటర్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్, వివిధ ప్రధాన మిగతా 6వ పేజీలో..

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ/నంద్యాల రూరల్



సమస్యాత్మ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆళ్లగడ్డ, నంద్యాల మండలాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిలు సందర్శించారు. ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం, బాచేపల్లి, పెద్ద చింతకుంట, ఆళ్లగడ్డ టౌన్‌లోని ఎద్దుల పాపమ్మ హైస్కూల్, నంద్యాల రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్.కొత్తపల్లిలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఎవరైనా ఎన్నికల్లో అలజడులు సృష్టించినా, ప్రోత్సహించినా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. త్వరలోనే కేంద్ర బలగాలు కూడా వస్తాయని, వారితో ఫ్లాగ్ మార్చ్ చేస్తామన్నారు. అనంతరం కార్యక్రమంలో నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సంతోష్, ఆళ్ళగడ్డ డిఎస్‌పి షర్ఫుద్దీన్, నంద్యాల టౌన్ రవీంద్రనాథ్ రెడ్డి, సిఐలు రమేష్ బాబు, హనుమంతు నాయక్, ఎస్ఐలు నగీనా, నరసింహులు, తహశీల్దార్ షేక్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖరయ్య, ఎంఇఒ శోభ వివేకవతి తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై స్వామి అమ్మవార్లు

- మూడోరోజు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లు హంస వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం నుండి రాత్రి వరకు స్వామి అమ్మవార్లకు యాగశాలలో ప్రత్యేక పూజలు, లోక కళ్యాణం కోసం జపాలు, పారాయణలు, మండపారాధనలు, పంచవరార్చణలు, శివ పంచాక్షరి, నిత్య హవనాలు, రుద్ర హోమం, చండీ హోమం నిర్వహించారు. సాయంకాలం ప్రదోషకాల పూజలు, రుద్రపారాయణలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో నిర్వహించే వాహన సేవలలో భాగంగా స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను అక్క మహాదేవి అలంకార మండపంలో హంస వాహనంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యుత్ దీపాలు, వేదమంత్రాల మధ్య ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింపజేసి గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అక్కడి నుండి నంది గుడి వరకు, అక్కడి నుండి బయలువీరభద్ర స్వామి వరకు, తిరిగి ఆలయంలోకి ప్రధాన వీధుల్లో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో నాదస్వరం, చెక్కభజన, కోలాటం, రాజభటుల వేషాలు, కేరళ చండీ మేళం, కొమ్ము కొయ్యనృత్యం, ముంబై డోల్‌తాషా, మహిళా వీరగాని కన్నడ జానపద కళ ప్రదర్శన, పురుషుల వీర గాని కన్నడ జానపద కళ ప్రదర్శన, కాళికా నృత్యం, జాంజ పథక్, జానపద పగటి వేషాలు, గొరవ నృత్యం, బుట్ట బొమ్మలు, తప్పెడు చిందు, బీరప్ప డోలు, నందికోలు సేవ, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం తదితర నృత్య ప్రదర్శకులు, కళాకారులు పాల్గొన్నారు. అలాగే నిత్య కళారాదన వేదిక వద్ద భరతనాట్యం కూచిపూడి నృత్య ప్రదర్శన, పుష్కరిని వద్ద ఆంధ్రనాట్యం కూచిపూడి నుండి ప్రదర్శన, శివ దీక్ష శిబిరాలలో గయోపాఖ్యానం, సత్య హరిచంద్ర నాటకం వంటి ప్రదర్శన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మల్లన్నను దర్శించుకున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ : స్వామి అమ్మవార్లను రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూన మాలకొండయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరు కుటుంబ సమేతంగా ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే దేవస్థానం ఇఒ పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచనం మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. శేష వస్త్రాలను, ప్రసాదాలను, జ్ఞాపికను ఈఒ అందజేశారు.



హంసవాహనంపై గ్రామోత్సవంలో స్వామిఅమ్మవార్లు

విజ్ఞానం అందించడమే లక్ష్యం

- ప్రజలకు, విద్యార్థులకు సేవలు
- ప్రజాశక్తితో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల బంగారు భవిష్యత్తు కోసం భావి భారత పౌరులకు విజ్ఞానాన్ని అందించడమే ప్రధాన లక్ష్యంగా గ్రంథాలయ సంస్థ పని చేస్తుందని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్ అన్నారు. "ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలలో 59 గ్రంథాలయాలు పనిచేస్తున్నాయి. ప్రధాన పట్టణాలే కాగా మండల కేంద్రాల్లో సైతం గ్రంథాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు, విద్యార్థులకు కావాల్సిన జ్ఞానాన్ని అందిస్తున్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా గ్రంథాలయాలలో పుస్తకాలను తెప్పించి, విద్యార్థులకు రూ.50, పెద్దలకు రూ.వంద చొప్పున సభ్యత్వం వసూలు చేసి వారికి పుస్తకాలను అందజేస్తున్నాము. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ గ్రంథాలయాలను, ఇంటర్నెట్ సౌకర్యాలు కూడా కల్పిస్తూ, విద్యార్థులకు అందుబాటులో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత హోదాలో ఉండే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుంది." అని పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...



ఉమ్మడి జిల్లాల్లో ఎన్ని గ్రంథాలయాలు ఉన్నాయి? అందులో సొంత భవనాలు ఎన్ని?

కార్యదర్శి : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 59 గ్రంథాలయాలు ఉన్నాయి. అందులో 29 సొంత భవనాలు, 21 అద్దె భవనాలు, 9 ఉచిత భవనాల్లో గ్రంథాలయాలను నిర్వహిస్తున్నాం. 12 గ్రంథాలయాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

గ్రంథాలయాల్లో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారు?

కార్యదర్శి : గ్రంథాలయాల్లో 106 మంది శాంక్షన్ స్టాఫ్ అయితే అందులో 46 మంది రెగ్యులర్‌గా పనిచేస్తున్నారు. సహాయకులు 7 మంది, రికార్డ్ అసిస్టెంట్లు 4, అటెండర్లు 6 మంది పనిచేస్తున్నారు. అందులో 16 మంది లైబ్రేరియన్లు, ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న వారు 26 మంది ఉన్నారు.

ఎక్కడెక్కడ గ్రంథాలయాల నిర్మాణం పనులు జరుగుతున్నాయి?

కార్యదర్శి : కోసిగి ,కౌతాళం, బేతంచెర్ల, ఓర్వకల్లు, నన్నూరు, చిప్పగిరి, గడివేముల, పాములపాడు, పగిడ్యాల, చాగలమర్రిలలో కొత్త భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఇంటర్నెట్ సౌకర్యాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?

కార్యదర్శి : కర్నూలు, నంద్యాల, బనగానపల్లి, డోన్, కోవెలకుంట్లలలో ఇంటర్నెట్ సౌకర్యాలు ఉన్నాయి. వీటి కోసం ఒక్కొక్క గ్రంథాలయానికి రూ.50 వేల నుండి రూ.20 లక్షల వరకు ఖర్చు చేశాం.

గ్రంథాలయాల్లో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?

కార్యదర్శి : జిల్లా గ్రంథాలయాల్లో 6,01,059 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షల కోసం వచ్చే యువత కోసం వారికి కావాల్సిన పుస్తకాలు తెప్పించడం జరుగుతుంది. కాబట్టి కర్నూలు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఎల్లప్పుడూ గ్రంథాలయం నిరుద్యోగులు, విద్యార్థులు పాఠకులతో కళకళలాడుతుంది.

గ్రంథాలయాల్లో సభ్యత్వం కలిగిన వారు ఎంతమంది ఉన్నారు?

కార్యదర్శి : జిల్లా గ్రంథాలయాల్లో 61,586 మంది సభ్యత్వం తీసుకున్న వారు ఉన్నారు. సభ్యత్వం తీసుకున్న వారు పుస్తకాలను ఇంటికి తీసుకుని వెళ్లి చదువుకొని తిరిగి 15 రోజులకు ఇవ్వాల్సి ఉంటుంది. గ్రంథాలయ చైర్మన్ మద్దూర్ సుభాష్ చంద్రబోస్ సహకారంతో కళాశాలలో, పాఠశాలలో సమావేశాలు నిర్వహించి గ్రంథాలయాలను పరిచయం చేసి సభ్యత్వాలు పెంచడం జరిగింది.

గ్రంథాలయాల పన్ను ఎంత బకాయి ఉంది?

కార్యదర్శి : గ్రంథాలయాల పన్నులు సుమారు రూ.10 కోట్ల బకాయిలు ఉన్నాయి. అందు 2023-24 సంవత్సరానికి గాను రూ.5,28,16,050 జమ అయ్యాయి. అందులో పరిశ్రమల ద్వారా రూ.12,73,245, పంచా యతీల నుండి రూ.60,86,960, మున్సి పాలిటీల నుండి రూ.45,07,654, కర్నూలు కార్పొరేషన్ నుండి రూ.4,09,48,196 జమ అయ్యాయి. ప్రభుత్వం నుండి గ్రంథాలయాలకు (గ్రాంట్) నిధులు మంజూరు అయితే వాటి ద్వారా గ్రంథాలయాలకు కావలసిన నూతన భవనాలు నిర్మాణాలు చేస్తాం. పుస్తకాలను టెండర్ల ద్వారా పిలిచి కొనుగోలు చేయడం జరుగుతుంది.





మహానంది దేవస్థానం
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న దేవస్థానం ఇఒ కాపు చంద్రశేఖర్ రెడ్డి)

బ్రహ్మోత్సవాలకు మహానంది ముస్తాబు

- 6 నుండి 11 వరకు ఆర్జిత సేవలు నిలుపుదల
- ఇఒ కాపు చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - మహానంది : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మహానంది క్షేత్రం ముస్తాబయింది. భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 6వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఆర్జిత సేవలు నిలుపుదల చేసినట్లు చెప్పారు. క్షేత్రంలోని లోపలి కోనేరులో భక్తులకు పుణ్య స్నానాలకు అనుమతి లేదని, బయట ఉన్న కోనేరులలో మాత్రమే అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక టికెట్ కౌంటర్లు, క్యూలైన్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, బిస్కెట్‌లను దాతల సహకారంతో అందించనున్నట్లు చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు పదెకరాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 8వ తేదీ మహా లింగోద్భవం సందర్భంగా ప్రతి భక్తుడికి లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం తిలకించేలా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 9వ తేదీ తెల్లవారుజామున స్వామి అమ్మవార్ల కళ్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

'గృహ నిర్మాణాలకు జువారి సిమెంట్‌ను వినియోగించండి'

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : గృహ నిర్మాణాలకు నాణ్యమైన జువారి సిమెంటును ఉపయోగించాలని టిడిపి నాయకులు, కాంట్రాక్టర్ నన్నేబై గారి జిలాని, ఎస్ఎస్ కె ఎంటర్‌ప్రైజెస్ అధినేత శేఖర్‌లు అన్నారు. ఆదివారం ఎస్ఎస్కే కార్యాలయంలో వారు మాట్లాడుతూ నూతనంగా గృహాలను నిర్మించుకునే వారికి ఎస్ఎస్కే ఎంటర్‌ప్రైజెస్‌లో నాణ్యమైన ముడి పదార్థాలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం అత్యధికంగా ఒక నెలలో 2500 సిమెంటు బస్తాలను ఉపయోగించిన నన్నే భాయ్ గారి జిలానికి ఫ్రిజ్‌ను బహుమతిగా ఎస్ఎస్కె అధినేత శేఖర్ అందజేశారు.



ఫ్రిజ్ ను అందజేస్తున్న దృశ్యం

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బనవాసి మహేష్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు పిఎస్ఎస్ నారాయణ కార్యాలయంలో సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన జిల్లా నాయకులకు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశు ్యలకు రాజకీయంగా ఘన చరిత్ర ఉందన్నారు. సంజామలకు చెందిన దివంగత నేత పెండేకంటి వెంకటసుబ్బయ్య నంద్యాల పార్లమెంట్ నుండి ఆరుసార్లు గెలిచారని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, కేంద్ర మంత్రిగా, బీహార్, కర్ణాటక రాష్ట్రాలకు గవర్నర్‌గా పని చేశారన్నారు. రాజకీయాలలో అత్యున్నత స్థానంలో ఉండి ఆర్యవైశ్యుల కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోనే ప్రథమ స్థానం వహించాలన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేద ఆర్యవైశ్య విద్యార్థులు ఉన్నత విద్య చదువు కునేందుకు తమ వంతు సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆర్యవైశ్యులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, రాజకీయంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు బింగుమళ్ళ శ్యాంసుందర గుప్తా, పొలిటికల్ చైర్మన్ కొత్త సుబ్బయ్య, కాల్వవ విజయ శేఖర్, మామిళ్ల నాగరాజు, బనగానపల్లె పట్టణ శాశ్వత గౌరవాధ్యక్షులు పిఎస్ఎస్ నారాయణ, నాయకులు నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయ్ కుమార్, ఎం.భరతుడు, కాసుల జంగం శెట్టి, దమ్మాల వెంకటసుబ్బయ్య, బండారు ప్రకాష్, నాగేంద్ర కుమార్ శివరాజ్, అర్యవైశ్య మహిళా మండలి మాజీ జిల్లా అధ్యక్షురాలు నూకల వాసంతి, బండారు లలిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బనవాసి మహేష్

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్ : బిసి ఇందిర

ప్రజాశక్తి - బనగానపల్లె : నిరుద్యోగులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలువునా నట్టేట ముంచారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్థాయి తొలి ఓటర్ల అవగాహన కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ ఇందిరా, బీసీ రామనాథ్ రెడ్డి, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఎన్నో హామీలిచ్చి ముఖ్యమంత్రి అయ్యాక ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయారని విమర్శించారు. ఎపికి ప్రత్యేక హోదా సాధించడంలో విఫలమయ్యారని అన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అమలు చేస్తానని చెప్పి, ఆయన కేసుల కోసం ఎపిని కేంద్రానికి తాకట్టు పెట్టారని విమర్శించారు. కొత్తగా ఓటు నమోదయిన వారు రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. నాడు టిడిపి ప్రభుత్వంలో రాయల్టీ తగ్గిస్తానని చెప్పి తగ్గించిన ఘనత బీసీ జనార్ధన్ రెడ్డికి ఉందని, 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాయల్టీ ఎత్తివేస్తామని చెప్పి పెంచిన ఘనత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికే దక్కిందని విమర్శించారు. బిసి జనార్దన్ రెడ్డి ఏదైనా చెప్పాడంటే తప్పనిసరిగా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం పక్కిరా రెడ్డి, టిడిపి నాయకులు అన్వర్ సాహెబ్, కార్పెంటర్ షబ్బీర్, కార్యకర్తలు, కొత్తగా ఓటు హక్కు పొందిన యువత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిసి ఇందిరా

కళ్లుండి గుడ్డివారిలా ప్రతిపక్షాలు

- రూ. 62 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతిపక్ష నాయకులు కళ్లుండి చూడలేని గుడ్డివారిలా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బేతంచర్ల మండలంలో మంత్రి బుగ్గన సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో రూ. 62 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. బేతంచెర్ల పట్టణం నుండి కొలుములపల్లి, ఎం.పెండేకల్లు, రామళ్ళకోట మీదుగా వెల్దుర్తి వరకు, వీరాయిపల్లికి, మర్రికుంటకు, గూటుపల్లి నుండి శ్రీ పాలుట్ల రంగస్వామి దేవాలయం వరకు, కెకె కొట్టాల గ్రామం నుంచి బిల్వస్వర్గం గుహల వరకు నిర్మించిన రహదారులను ప్రారంభించారు. మరో రూ. 8 కోట్లతో ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలోని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయాల పునరుద్ధరణ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఒక్క జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. మండలంలో జరిగిన అభివృద్ధి పనులను గమనించి ప్రజలు జగనన్న ప్రభుత్వాన్ని మరొకసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, జడ్పిటిసి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయం, ఈవో రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైస్ ఎంపీపీ రంగస్వామి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వాల్మీకి సంస్థ డైరెక్టర్ మురళీకృష్ణ, డోన్ ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ జీవనచంద్ర శేఖర్, ఉర్దూ అకాడమీ రాష్ట్ర నాయకులు మూర్తిజావలి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, బలపాలపల్లి సర్పంచ్ చిన్న మద్దమ్మ, రంగాపురం సర్పంచ్ గుమ్మగాల రాజు, ఎద్దులన్న, 4వ సచివాలయం కన్వీనర్ భాస్కర్, వెంకటేశ్వర్ రెడ్డి, కాజా హుస్సేన్, గుంటుపల్లి శీను తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన తదితరులు



టిడిపిని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్న గట్టు రమేష్ కుమార్ తదితరులు

టిడిపిని వీడి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలో బంగారు నగల వ్యాపారి, టిడిపి నాయకులు గట్టు రమేష్ కుమార్ ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో గట్టు రమేష్ కుమార్, భాస్కర్ రాజు, మన్యం, హరి, శివకృష్ణ, నాగరాజు, రాహుల్, పకీరయ్య, రషీద్ భాష, ఉదయ్, సుషి, యూసుఫ్, నాదు, బాషాలు టిడిపిని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిల సమక్షంలో వైసీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వైసిపి కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, బనగానపల్లె ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని గెలిపించుకోవడమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, అత్తార్ అఖిల్ హుస్సేన్, దుర్గా కోనేటి, ఇంతియాజ్, ఆస్థానం ఖమర్ అబ్బాస్, పక్కీర తదితరులు పాల్గొన్నారు.

జొన్నలు కొనుగోలు చేయాలి

- జెసిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : రైతులకు ఇబ్బంది లేకుండా గోదాములకు తెచ్చిన జొన్నలన్నింటినీ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి తదితరులు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిని కోరారు. గోదాములకు జొన్నలు తెచ్చి ఇబ్బందులు పడుతున్న రైతులతో కలిసి వారు ఆదివారం జెసిని కలిసి చర్చించారు. జొన్నలు నాణ్యత లేవని తీసుకోకుండా వెనక్కు పంపుతున్నారని జెసి దృష్టికి తీసుకెళ్లారు. జెసి మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే కొనుగోలు చేస్తామని, శాంపిల్స్ సేకరించి వాటిని పరిశీలించి కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కొంచెం నాణ్యత లోపించిన జొన్నలుంటే 5 నుండి 6 శాతం తరుగు తీసి కొనుగోలు చేస్తామని తెలిపారు.



జెసితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, మార్కెట్ యార్డ్ చైర్మన్

రద్దీని అనుసరించి అన్నప్రసాద వితరణ

ప్రజాశక్తి - శ్రీశైలం


తనిఖీ చేస్తున్న ఇఒ

శ్రీశైల క్షేత్రానికి భక్తుల రద్దీని అనుసరించి అన్న ప్రసాద వితరణ జరిపిస్తూ ఉండాలని దేవ స్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు సిబ్బందికి సూచించారు. ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా క్షేత్రంలోని పలు పనులను ఇఒ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న ప్రసాదం కౌంటర్ల వద్ద భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని సూచించారు. క్షేత్ర పరిధిలో పలుచోట్ల స్వచ్ఛంద సేవాకర్తలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్కింగ్ ప్రదేశాలలో కూడా నిరంతరం మంచినీరు అందే విధంగా చూడాలని సంబంధించిన అధికారులకు సూచించారు. ప్రధాన కూడలిలో వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ సహకారంతో నిరంతరం పర్యవేక్షించాలని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. రద్దీ ప్రదేశాలలో పోలీస్ సహకారంతో భక్తుల రద్దీ అధికంగా ఉండకుండా చూడాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండే విధంగా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. చెక్ పోస్ట్ , యజ్ఞవాటిక, గణేష్ సదన్, విభూది మఠం, ఆగమ పాఠశాల, మొదలైన చోట్ల పార్కింగ్ ప్రదేశాలను కూడా పరిశీలించారు.

అన్న ప్రసాద వితరణానికి విరాళాలు

శ్రీశైల దేవస్థానం నిత్యం అందిస్తున్న నిత్య అన్న ప్రసాద వితరణ పథకానికి ఆదివారం పలువురు విరాళములు అందజేశారు. విరాళంలో అందించిన వారిలో హైదరాబాదుకు చెందిన సోమశేఖర్ బాబు రూ. 2,02,232, కృష్ణా జిల్లాకు చెందిన జ్యోష్ణ కుమార్ వీర రూ. 1,01,015 విడివిడిగా సహాయ కార్య నిర్వాహణాధికారి ఫన్నీధర్ ప్రసాద్‌కు అందజేశారు. విరాళంలో అందజేసిన వీరికి శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా అధికారులు తెలిపారు.

ఘనంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజవర్గ మాజీ శాసనసభ్యుడు బుడ్డా రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం అర్ధరాత్రి నుండి టిడిపి శ్రేణులు కేకులు కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి గౌరీ సెంటర్ నందు వందలాది మంది కార్యకర్తలు కేకులు కట్ చేసి బుడ్డా జన్మదిన వేడుకలు నిర్వహించుకోగా. ఆదివారం నాడు పార్టీ కార్యాలయంలో భారీ కేకును కార్యకర్తలు కట్ చేసి బుడ్డా రాజశేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు అందించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు బ్రెడ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఆ తర్వాత కరివేన గ్రామ సమీపంలోని మానవతా నిలయంలో ఉన్న వృద్ధులకు భోజన వసతిని అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవింద రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు జట్టి వేణుగోపాల్, మండల అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, రవి ప్రసాద్, టిడిపి పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయంలో కేకులు కట్ చేస్తున్న టిడిపి శ్రేణులు

దాహమో... శివ


నలమల్ల అడవిలో నడుస్తున్న భక్తులు

- శ్రీశైల కాలికడక భక్తులకు తాగునీరు కరువు
- అడవి మార్గంలో ఏర్పాట్లు నిల్
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- వాటర్ బాటిల్ రూ .40, శుద్ధి చేయని వాటర్ రూ.20
- సామాన్య భక్తులు కొనలేక ఇక్కట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో స్వామి అమ్మవార్లు దర్శించుకునేందుకు అడవి మార్గంలో పాదయాత్రగా వస్తున్న భక్తులకు దేవస్థానం గానీ, ప్రభుత్వం గానీ భక్తులకు చేయవలసిన ఏర్పాట్లు ఏమాత్రం చేయలేదని, తీవ్రమైనా ఎండలతో అల్లాడుతూ అడవి మార్గంలో శివ శివ శ్రీశైలం మల్లన్న అంటూ బయలుదేరిన భక్తులకు అడవి మార్గంలో తాగునీరు ఏర్పాట్లు లేవని భక్తులు వాపోతున్నారు. మార్గమధ్యంలో ఏర్పాటు చేసే దుకాణాలలో వాటర్ బాటిల్ రూ.40, లూజు వాటర్ అయితే రూ.20లకు, మరికొన్ని చోట్ల శుద్ధి చేయని నీరు రూ.20 లీటర్ వాటర్ కొనవలసిన పరిస్థితి ఏర్పడిందని భక్తులు వాపోతున్నారు. సామాన్య పేదలు అయితే కొనలేక దాహంతో తీవ్ర


నడక దారిలో భక్తులు

ఇబ్బందులకు గురవుతున్నట్లు భక్తులు పేర్కొన్నారు. అధిక ధరలకు అమ్ముతున్నప్పటికీ ఏమాత్రం ఎవ్వరు పట్టించుకునే నాధుడే లేడని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంకటాపురంలో మాత్రమే తాగు నీటి ఏర్పాట్లు చేయడం జరిగింది. ఆ తర్వాత పెద్ద చెరువు వద్ద అన్నదాన కార్యక్రమంలో మాత్రమే ఉచితంగా తాగునీరు అందించడం జరుగుతోందని, మిగిలిన ప్రదేశాలలో ఎక్కడా.. తాగునీరు ఏర్పాట్లు కనబడడం లేదని భక్తులు తెలిపారు. ఉచిత మెడికల్ క్యాంపు ఒక పెద్ద చెరువు దగ్గర మాత్రమే ఉందని వారు తెలిపారు. వెంకటాపురం నుండి కైలాస ద్వారం చేరుకునే వరకు మార్గమధ్యంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని రోజురోజుకు ఎండలు ముదురుతున్న కొద్దీ భక్తులు తీవ్ర సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ఇప్పటికైనా అధికారులు తాగునీటి ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానంలో

ఎమ్మెల్యే శిల్పా రవి దంపతులు

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపాన ఉన్న దక్షిణ కాశిగా పేరుపొందిన శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంకు వచ్చిన వారికి ముందుగా ఆలయ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు పూర్ణ కుంభముతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి దంపతులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందించి పూలమాలతో శాలువతో సత్కరించి మెమొంటో అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రమణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దంపతులకు మెమొంటో అందిస్తున్న ఆలయ చైర్మన్

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అందుకు అనుగుణంగానే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్, ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా అన్నారు. ఆదివారం షాది ఖానా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. స్థానిక పెద్ద మసీదు నుండి షాది ఖానా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆత్మకూరు పట్టణం లోని అన్ని హంగులతో షాదీ ఖానా నిర్మించడం జరిగిందన్నారు. నేడు పేద ముస్లిం మైనార్టీ ప్రజలు ఈ షాదీఖానాలో వివాహ వేడుకలు నిర్వహించుకొనేందుకు అనుగుణంగా వీటిని నిర్మించడం జరిగిందన్నారు. శిల్ప కార్తీక్ రెడ్డి, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీరు, వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు సుల్తాన్, పాణ్యం పార్వతి, బోయ పార్వతి, యూనుస్, మున్సిపాలిటీ కమిషనర్ హరిప్రసాద్, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

దుర్గా మల్లేశ్వర్లకు కనకదుర్గమ్మ పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం నాడు దుర్గా మల్లేశ్వర దేవస్థానం విజయవాడ వారిచే కట్టు వస్త్రాలను సమర్పించారు. దుర్గా మల్లేశ్వర దేవస్థానం ధర్మకర్తల బండలి అధ్యక్షులు రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామారావు అర్చకులు వేదపండితులు సంప్రదాయంగా పట్టు వస్త్రాలతో ఆలయ రాజగోపాల్ వద్దకు చేరుకున్న వీరికి శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణి రెడ్డి, కార్యనిర్వాన అధికారి పెద్దిరాజు అర్చక వేద పండితులు సంప్రదాయపదంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారికి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పి ంచారు. అనంతరం అమ్మవారి వేద ఆశీర్వచన మండపంలో వీరికి వేద పండితులు ఆశీర్వచనం పలకగా శేష వస్త్రాలను ప్రసాదాలను ఇఒ అందజేసిన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.


పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న దృశ్యం

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం


పూర్తిగా కాలిపోయిన గుడిసె

ప్రజాశక్తి - పాములపాడు : మండలంలోని జూటూరు గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమై దాదాపుగా మూడు లక్షల దాకా ఆస్తి నష్టం జరిగింది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన జనార్ధన్ గౌడ్ గత కొన్ని సంవత్సరాలుగా పూరిగుడిసెలో జీవనం కొనసాగి స్తున్నారు. బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి కర్నూల్‌కి వెళ్ళాడు. షార్ట్ సర్క్యూట్తో పూర్తిగా దగ్ధం అయిపోయింది. గ్రామస్తులు ఆత్మకూరు అగ్నిమాపక కార్యా లయానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్ నాయక్, గౌస్, కరిముల్లా, అన్సర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- సర్పంచి నాయిని సావిత్రమ్మ

షార్ట్ సర్క్యూట్ లో పూర్తిగా సర్వం కోల్పోయిన జనార్ధన్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జూటూరు గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ కోరారు. తక్షణ సహాయంగా ప్రభుత్వం రేషన్, వంట సరుకులు అందించి, ఆ కుటుంబానికి పక్కా గృహాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భారత్ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - పగిడ్యాల

భారత్ కిసాన్ సంఘ్ సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగాల సిద్ధారెడ్డి, జిల్లా అధ్యక్షులు పల్లె సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం పగిడ్యాల గ్రామంలోని చిట్టి రెడ్డి నివాసంలో వారు మాట్లాడారు. భారత్ కిసాన్ సంఘ్ సభ్యత్వం కార్యక్రమం చెప్పడం వల్ల రైతులు ఎదుర్కొం టున్న సమస్యలపై పరిష్కారం కోసం పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా నీటిపారుదల, విద్యుత్తు, ధాన్యం సేకరణ పై రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా పరిష్కా రానికి చూపిస్తుందన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల వచ్చే సమస్యలను వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. స్థానిక సమస్యలపై మండల, జిల్లా స్థాయి కమిటీల ఆధ్వర్యంలో చేసి రైతులకు మేలు చేసే విధంగా పోరాటాలు చేస్తామన్నారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోక కేంద్రం మెడికల్ కళాశాల వైద్యశాల నిర్మించినందుకు జూపాడు బంగ్లా మండలం తంగడంచ ఫారం సమీపాన వందల ఎకరాలు సేకరించి నిర్మాణానికి జీవో విడుదల చేసిందని, కానీ ఇంతవరకు ఎటువంటి నిర్మాణం పనులు జరగకపోవడం విచారకర మన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే జీవోను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘం భారత్ కిసాన్ సంఘ్ అని అన్నారు. భారత్ కిసాన్ సంఘ్ దాదాపు తొమ్మిది కోట్ల మంది సభ్యత్వం తీసుకున్న వారు ఉన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి. రైతు చిట్టి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కొత్తపల్లి


తాగు నీటి బోరును ప్రారంభిస్తున్న మాజీ మండల ఉపాధ్యక్షులు

రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి సహకారంతో గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం అయ్యిందని మాజీ మండల ఉపాధ్యక్షులు వైకాపా మండల నాయకులు నాయకులు మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలో తాగునీటి కోసం పైపు లైన్ నిర్మాణం చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత కొంత కాలంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని అయితే ఆ సమస్యను రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి తాగునీటి సమస్య పరిష్కారం కోసం కావలసిన సామాగ్రి బోరు మోటర్ పైప్ లైన్ వేసేందుకు సహాయ సహకా రాలు అందించడం జరిగిందన్నారు. గ్రామస్తులకు తాగునీటి సమస్య లేకుండా చూడడం జరిగిందన్నారు. ఎంతో కాలం నుంచి ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ బంగి నాగన్న వైఎస్ఆర్సిపి నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

పిఎస్‌కె కంపెనీ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కర్నూలు నుండి ఆత్మకూరు వరకు నేషనల్ హైవే జాతీయ రహదారి వేస్తున్న పిఎస్‌కే కంపెనీ కాంట్రాక్టర్‌ను వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఆదివారం నియోజకవర్గ సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక భరత్ కాంప్లెక్స్‌లో సిపిఎం నాయకులు పి,పకీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఎం నాగేశ్వరావు, కె భాస్కర్‌రెడ్డి, టి గోపాలకృష్ణ మాట్లాడుతూ నేషనల్ హైవే 340 జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మార్కెట్ రేటు కంటే నాలుగు రెట్లు చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరావు

ఇవ్వాలని వ్యవసాయ కూలీలకు చేతి వృత్తిదారులకు పరిహారం ఇవ్వాలని, పట్టా భూములతో సమానంగా ప్రభుత్వ అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వాలని చట్టంలో ఉన్న అమలు చేయలేదన్నారు. నేషనల్ హైవే కోసం ఎన్ఓసి లేకపోయినా ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా గ్రావెల్, మట్టి తరలించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా లోతుగా మట్టిని తవ్వారని గ్రామా లకు వెళ్లే రహదారులు గ్రామాల్లో సిసి రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. నేషనల్ హైవే బ్రిడ్జి నిర్మాణాలు కంకరపై వాటర్ క్యూరింగ్ సక్రమంగా జరగడం లేదనీ వారు ఆరోపించారు. నేషనల్ హైవే పనులపై సమగ్ర విచారణ చేపట్టి రైతులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలన్నారు. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, సెక్యూరిటీ గార్డ్స్, కంపెనీలో చేసే కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐతో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుండి పిఎస్‌కే కంపెనీ ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం ప్రజాసంఘాల నాయకులు వి శ్రీనివాసులు, టి ఓబులేసు, ఈశ్వరమ్మ, నాగన్న, సంపంగి వెంకటేశ్వర్లు, ఏ రాము,గంధం హుసేనమ్మ, శివ రాముడు, ప్రసాద్, కొమ్ము వెంకటేశ్వర్లు, నాగేంద్ర, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ పే ద్వారా మినరల్ వాటర్ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వెలుగోడు



ఫోన్ పే క్యూఆర్ కోడ్ ద్వారా మినరల్ వాటర్ అందుబాటులో ఉందని ఎంపీడీవో సయ్యద్ ఉమర్ అన్నారు. ఆదివారం ఆయన వెలుగోడు పట్టణ మక్కా మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాయిన్ బాక్స్‌లో ఐదు రూపాయలు వేసి 18 లీటర్ల మంచినీటిని తీసుకోని వెళ్ళవచ్చు అని తెలిపారు. రూ.2 వేసిన ఆ అమౌంట్‌కు తగినంత వాటర్ వస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు, పర్యటకులకు కూల్ వాటర్ సదుపాయం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇంచార్జ్ షంషుద్దీన్, మౌలానా మహబూబ్ రహమాన్, గఫుర్ మౌలానా పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు రెండు చుక్కలు

5వ పేజీ తరువాయి.. కూడళ్లలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.ప్రసన్న లక్ష్మి, అడిషనల్ డిఎం హెచ్ఒలు డాక్టర్ బాలాజీ, డాక్టర్ కాంతారావు తదితరులు పర్యవేక్షించారు. అలాగే నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఆయన సతీమణి నాగిని రవి సింగారెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ అంకిరెడ్డి, వెంకట్ రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, అడ్వకేట్ బాబురావు, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పిల్లలకు పోలియో చుక్కలు వేయించి అంగవైకల్యాన్ని అరికట్టాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 5వ సచివాలయంలో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చిన్నారులకు ఎమ్మెల్యే పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిడిఒ శివరామయ్య, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివ శంకరుడు, ఎంపీహెచ్ఈఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఎంఎస్‌హెచ్‌పి రమేష్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని నరసాపురం, రుద్రవరం, ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్ర రెడ్డి తనిఖీ చేశారు. వైద్యులు, హెల్త్ సిబ్బంది, ఆశాలు, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు. **శ్రీశైలం :** శ్రీశైలంలోని ఆలయ మహాద్వారం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో దేవస్థానం ఇఒ డి. పెద్దిరాజు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల బస్టాండ్‌లో డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫార్మాసిస్టు సురేష్, నరసింహ, ఉమా మహేశ్వరి, సుబ్బరాయుడు పాల్గొన్నారు. **మహానంది :** చక్కని భవితకు తీయ్యని చుక్కలు ఎంతో మేలని రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం అన్నారు. మహానంది మండలంలోని తిమ్మాపురం గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని 143 పోలింగ్ కేంద్రాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ భగవాన్ దాస్, డాక్టర్ వెంకట్ రెడ్డి, ఎంపీహెచ్ఈ హుస్సేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మహానంది క్షేత్రానికి వచ్చిన భక్తుల చిన్నారులకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. **ఆళ్లగడ్డ :** నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అవసరమని శాసనసభ్యులు ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీహెచ్వో దస్తగిరి రెడ్డి, డాక్టర్ నరసింహ, ఏఎన్ఎం శాంతి తదితరులు పాల్గొన్నారు. **అవుకు :** అవుకు మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగిందని ఉప్పలపాడు ప్రాథమిక వైద్యులు డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. అవుకులో ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **పగిడ్యాల :** మండలంలోని పోలియో కేంద్రాలను అదనపు జిల్లా వైద్యాధికారి శారదా భాయ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడారు. మండల పరిధిలోని 26 పోలింగ్ కేంద్రాలలో 3204 మంది పిల్లల గాను 3044 పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. జడ్పిటిసి పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న ఆయా గ్రామాల సర్పంచులు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామ గుప్త, పి హెచ్ ఎం భాగ్యలక్ష్మి, సూపర్వైజర్ శివ గౌరీ, తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ప్రభుత్వ వైద్యాధికారి వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వారి బంగారు భవిష్యత్తుకి బాటలు వేయాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. ఆదివారం డోన్ పట్టణంలోని యుపిహెచ్‌సి కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరయ్యారు. చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు చైర్మన్ సప్తశైల రాజేష్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ డోన్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రులు,అర్బన్ సెంటర్లు,బస్టాండ్,రైల్వే స్టేషన్ వివిధ ప్రధాన కూడళ్లలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జయరామ్,ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి,వైద్యులు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని ఏబీఎం పాలెం స్కూల్ ఆవరణలో పోలియో కేంద్రంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొల్లెద్దుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు కిరణ్ కుమార్ మాట్లాడుతూ నారాయణపురం గ్రామంలో పోలియో చుక్కలు వేయడం జరిగిందని తెలిపారు. బండి ఆత్మకూరులో 2893 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని డాక్టర్ భావన తెలిపారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని 14వ వార్డులో ఉర్దూ హైస్కూల్ నందు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా ప్రారంభించారు. పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి పోలియో రహిత మున్సిపా లిటీగా ఆత్మకూర్‌ను నిలపాలని సూచించారు. **గడివేముల :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 33 పల్స్ పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయించిన్నట్లు మెడికల్ ఆఫీసర్ మొల్ల జబీన్ తెలిపారు. పోలియో రహిత సమాజంగా ఉండేలా చూడాలని కోరారు. పోలియో కార్యక్రమంలో వారు పాల్గొని పోలియో బూత్‌లను తనిఖీ చేశారు. సూపర్వైజర్ లు , ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలో పోలియో బూతులను మెడికల్ ఆఫీసర్ షైనీ ప్రియాంక తనిఖీ నిర్వహించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నంది కొట్కూరు పట్టణంలోని సాయిబాబా పేట పాఠశాలందు పోలియో చుక్కల కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి సందర్శించి పోలియో చుక్కలను వేశారు. **చాగలమర్రి :** మండల వ్యాప్తంగా 96 శాతం పోలియో చుక్కలు వేయడం జరిగిందని మండల వైద్యాధికారి ఇమ్రాన్ తెలియజేశారు. జిల్లా నోడల్ అధికారి, తాలుకా మానిటరింగ్ అధికారి జగదీశ్ చంద్రారెడ్డి పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలో 95.06 శాతం పల్స్ పోలియో పూర్తి అయినట్టు మండల వైద్య అధికారిని నాగలక్ష్మి దేవి తెలిపారు. 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలు మండలంలో 3989 మంది పిల్లలు ఉన్నారని అందులో 3792 పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు. పోలియో చుక్కల కార్యక్రమంలో ఎంపీపీ సరోజినీ వర్జినియ, మండలంలోని వివిధ గ్రామాల సర్పం చులు కోట్ల చంద్రారెడ్డి, లత, వరప్రసాదరావు, రామస్వామి, మాణిక్యమ్మ, మేకల భాగ్య మ్మ, మంగమ్మ బాయ్, బాల మల్లేశ్వర్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **నంద్యాల రూరల్ :** పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమయిందనిడాక్టర్ సెహలం పేర్కొన్నారు. నంద్యాల మండలం లోని చాపి రేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తిమ్మా పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బండి ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం 94 శాతం పూర్తి చేశామన్నారు. వైద్యులు సెహలం, భావన, గోపాల్, బగవాన్‌దాస్ పాల్గొన్నారు.


శ్రీశైలంలో పోలియో చుక్కలు వేస్తున్న ఇఒ


ప్యాపిలిలో..


డోన్‌లో..


పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే, ఆయన సతీమణి


పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


ఆళ్లగడ్డ: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే


నంద్యాల రూరల్ : కొత్తపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది


పాములపాడు : పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ వరప్రసాదరావు